
# మహాభినిష్క్రమణం

మల్లాప్రగడ రామారావు



,జమేనేమిచేసద్మా? "అనుమానంగా అడిగింది వాసంతి - చంకలో పిల్లవాడు పాలకోసం రొమ్ము తడుముతున్నా ఖాతరుచెయ్యకుండా.

పద్మ మాట్లాడలేదు.

"ముంగిలా చూడు మాట్లాడదు. చేసిన వెధవపని చేసేసి" కూతురు బుగ్గలు రెండూ పొడిచింది- శాంతమ్మకి కోపం తీరడానికి యింకా ఏం చెయ్యాలో తోచలేదు.

అప్పటికీ పద్మ మాట్లాడలేదు.

ఆకలేసిన చంటివాడు పాలకోసం ఏడుస్తున్నాడు. అయినా వాసంతి పట్టించుకోకుండా "ఇంతకీ ఎవడా మహానుభావుడు?" అని అడిగింది. కప్పిపుచ్చలేని కుతూహలంతో.

"ఆ మహానుభావుడు మాయాప్రవరుడో విశ్వామిత్రుడో నీకెందుకుగాని, ముందు పిల్లడికి పాలు పట్టు."

అంతవరకూ పక్కగదిలో వుండి, ఆత్రుత నణచుకోలేక, ఎలా రంగంలోకి దిగాలా అని తహతహ లాడుతున్న రంగ

# మహాభినిష్క్రమణం

నాధ రావుకి పిల్లడి ఏడ్పు సాయపడింది.

అల్లుడి రాకతో శాంతమ్మ ముఖం చిన్నబోయింది.

"మధ్యన మీగొడవేమిటి? అది కొంపలు తీసే కొరివిలా వుంది. ఇంతాచేసి, ఆ మహానుభావులు మీరే కాదుకదా!" అని విసురుగా అంటూ, అదే విసురులో పైట తొలగించి, చంటివాడికి రొమ్ము అందించింది వాసంతి.

రంగనాధరావు తన జీవితంలో విన్న జోకుల్లోకల్లా అదే పెద్ద జోకైనట్టు, ఉప్పెనగా నవ్వాడు.

శాంతమ్మ ముఖం మరీ ముడుచుకుపోయింది - బాధను మించిన అవమానంతో అన్నాడు రంగనాధరావు.

నవ్వు అణచుకుని, పద్మవంక ఒక చూపు విసిరి, 'ఏ మొగుడూ లేకపోతే అక్క మొగుడేగత'న్నారు పెద్దలు. కాని నాబోటి వాడికంత అదృష్టం కూడానా.

రేణుక కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

శాంతమ్మ గుండెను మండించే అవమానంతో అక్కడినుండి వెళ్ళిపోయింది— పద్మవేపు ఉరిమి, ఉరిమి చూస్తూ.

పద్మ అలాగే నిల్చుంది మౌనంగా.

వాసంతి నవ్వు దాచుకోకుండానే అంది "పాడు మాటలూ మీరూను. పొండిక్కడనుంచి."

"పోతాను లేవే" అంటూ నిజంగానే గదిలోకి పోయాడు రంగనాధరావు- బీడీ ముట్టించుకుందుకు.

"అతని పేరు చెప్పావుకావు'' అంది వాసంతి నిష్ఠూరంగా.

రేణుక కళ్ళలో నీటిస్థానే కోపం నిండింది.

ఆ కోపం మాటల రూపందాల్చి వెలికొచ్చింది.

'పెద్దక్కా నువ్వు ఆడదానివి కాదు. అసలు మనిషివి కావు. హృదయం లేని రాయివి.'

"నిజమేనమ్మా రాయిని కాబట్టే కట్టుకున్న వాడే మన్మధుడని వాడితోనేవుంటూ దేవుడిగా ఆయన్నే కొలుచుకుంటూ పడివున్నాను. మీలాగ పెళ్ళిళ్ళు కాకుండానే" ఇంకా ఏదో అనబోయి ఆగి "ఎవరెలా చస్తే నాకేం? కాకపోతే మా యింట జన్మ యెత్తినందుకు ఈ ఘోర అవమానం యింత నా నెత్తిన వేసుకు బ్రతకాలి. తప్పుతుందా తల్లీ తోడబుట్టినందుకు" అంటూ మొగుడి గదిలోకి వెళ్ళిపోయింది.

*   *   *

"దాని పీక పిసికి నూతిలోకి తోసి నేనూ చస్తాను" అంది శాంతమ్మ ఏడుపుకి బొంగురు పోయిన గొంతుతో.

సుబ్బరామయ్య పంచ చెంగుతో కళ్ళు తుడుచుకున్నాడు. "వాడెవడో కనుక్కో. ఏ తంటాలోపడి పెళ్ళి జరిపించేద్దాం."

అన్నాడే కాని, ఏ తంటాలు పడగలడో సుబ్బరామయ్యకే తెలియలేదు.

చేస్తున్న గుమాస్తా గిరి కూడా ఏడాదిలో ముగింపు కొస్తోంది. చిల్లిగవ్వ ఆస్తిలేదు. పదేళ్ళ క్రిందట పెద్దపిల్ల వాసంతి పెళ్ళికి చేసిన అప్పులు యింకా తీరలేదు. ఎన్నో ఆశలుపెటుకుని చదివించిన కొడుకొక్కడూ పెళ్ళి చేసుకుని వేరే కాపురం పెట్టాడు. జీవితం గడవడమే దినదినగండంగావుంది.

తంటాలు పడగలగడం నిజమే అయితే పద్మ పెళ్ళి రేణుక పెళ్ళి ఎన్నడో చేసివుండును. అయినా అంతకుమించి ఏం చెయ్యాలో తోచక ఆ మాట అన్నాడు సుబ్బరామయ్య.

"ఏం చేసినా అది నోరు విప్పి ఆ పేరు చెప్పడంలేదు. ఏం పిల్లలో. పెరిగి పెద్దయి ఉద్ధరిస్తారని కంటాం. వాళ్ళేమో పరువు బుగ్గిపాలు చేస్తారు!"

"అలా అనకు శాంతా! పద్మ ఇలా చేసిందంటేనే నమ్మలేకుండా వున్నాను. దాని మనసు మెత్తనిది. ఏ అఘాయిత్యం చెయ్యకుండా చూడు."

"వయస్సు వరదలాంటిది: ఎంతవారికీ ఆ పొంగు ఆపుకోవడం సాధ్యంకాదు. జ్ఞాపకంలేదా మా నాన్న చనిపోయినప్పుడు పన్నెండు రోజులూ గడవకుండానే...."

శాంతమ్మ ముఖం జేవురించింది— చిగురించిన పాత జ్ఞాపకాలవల్లకాదు. చెడిపోయిన కూతురితో తన కాపరాన్ని పోల్చినందుకు.

"ఏమిటండీ ఆ మాటలు. మతీ, సుతీ లేకుండా" అంది కోపంగా.

"కోపం దేనికి శాంతా! పద్మ చేసిన పని తప్పుకాదు. తప్పు మనది. పరిగెత్తే గుర్రాల్లాటి కోరికలకు లొంగిన పిల్లల్ని కంటాం. కన్న పిల్లలకి వయసొచ్చినపుడు ఎన్నాళ్ళు కోరికల గుర్రాలకి కళ్ళెలు వేయగలరు? ముప్ఫయ్ సంవత్సరాలు పద్మకు...."

"సరే,ముందు ఏంచెయ్యడమో త్వరగా తేల్చండి. దాచినా దాగని విషయమిది."

సుబ్బరామయ్య చెయ్యగలిగిందిచేశాడు. తల పట్టుకుని పాత వాలుకుర్చీలో కూలబడ్డాడు.

*   *   *

"ఎక్కడా అనకు విమలా; కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఆ యింట్లో అమ్మకి తప్పించి ఎవరికీ చీమ కుట్టినట్టయినాలేదీ విషయం. నీతో చెప్తే తమ్ముడికి తెలుస్తుందికదా అని."

"అదేమిటోయ్ వాసంతి! కొత్తగా మాట్లాడుతున్నావు నాతోచెప్తే మీ తమ్ముడికెలా తెలుస్తుంది? పోయి మీ మరదలికి చెప్పు."

వాసంతి నవ్వింది. "పోదూ. అమ్మ పుట్టిల్లు మేనమామ దగ్గరా? మరదలైతే యిప్పుడొచ్చింది. కాని, నీతో చేకదా ప్రకాశం జీవితంలోకి వయసూ, వలపూ వచ్చింది."

విమల కూడా నవ్వింది. నవ్వుతూనే "ఎన్నాళ్ళుంటావు? నువ్వొచ్చినట్టు రెడ్డికింకా తెలిసినట్టులేదు. కబురంపనా?' అంది.

"రెడ్డి సంగతటుంచు.ఒక్కర్తినేరాలేదు కూడా మావారొచ్చారు. ఇంతకీ ఏదీ మీ వారొస్తున్నట్టులేదే?"

"ఏం, గాలి మళ్ళిందేమిటి మావారి మీదకి''.

"ఛ. మీవారూళ్లో లేకపోతే ప్రకాశం యిక్కడికే విజయంచేస్తాడు కదా - నేనే చెబుదామని."

''లేదులే. ఘడియకో, క్షణానికో మావారొచ్చేస్తారుగాని రెడ్డితో చెప్పి పద్మ కడుపు తీయించే ఏర్పాట్లు చెయ్."

"మధ్యన రెడ్డికేం బాధ?"

"బాధేమిటి? ఈ సాయం కాస్తచేస్తే పద్మ అతని ఋణం వుంచుకోదని చెప్పు"

"మనం చెప్పడమేగాని వినేదెవ్వరు? దానికే అంత వివేకముంటే, ఏ మందో, మాకో, ముందే వాడి జాగ్రత్త పడివుండును. సరే నే వెళ్తాను."

*   *   *

ప్రకాశం వస్తూనే జువ్వలా లేచాడు.

"మన యింటా, వంటా లేదు.వీధిలోకి వెళ్ళాలంటే సిగ్గుతో తలెత్తుకోలేక చస్తున్నాను. ఎవడేమంటాడోనని గుమ్మం దాటి రావడం మానేయాల్సొస్తుందింక" అంటూ.

"కాదుమరీ. ఫలానా వారమ్మాయనంటారుగాని...." చేర్చాడు రంగనాధరావు.

"ఖర్మ. ఏ వరకూ వచ్చిందీ?" అంది బుగ్గలు నొక్కుకుంటూ వాసంతి.

"ఊరంతా అనుకుంటుంటే...."

"అన్నయ్యా! ఊరంతా అంటే విమలనా అర్థం?"

అడిగింది రేణుక.

అలిగింది వాసంతి.

"విమల వరకే అనుకో—ఎలా వెళ్ళింది? నలుగురికీ తెలియబట్టేగా!"

'అక్కా నీకే తెలియాలి విమలకెలా తెలిసిందోను' రెట్టించింది రేణుక.

"ఇవాళ కాకపోతే రేపయినా తెలుస్తుంది. ఎవరూ చెప్పనక్కర లేకుండానే తెలుస్తుంది. దాచినా దాగకుండా తెలు

స్తుంది" అంటూ అర్ధాంగిని ఆదుకున్నాడు రంగనాధరావు.

తలపట్టుకు కూర్చున్నాడు సుబ్బరామయ్య.

ఆపదలోనైనా ఇంట్లో కొడుకు అడుగు పెట్టినందుకు అంత దుఃఖంలోనూ సంతోషించింది శాంతమ్మ.

"నాయనా ప్రకాశం! జరిగిందేదో జరిగింది. నీకంటే పెద్దది. నీకు అక్క. దాని బతుకు బుగ్గవకుండా, మన పరువు బజారు పాలుకాకుండా చూడాల్సిన వాడివి నువ్వు."

"ఏం చెయ్యమంటావమ్మా! నేచెప్పింది మీకు నచ్చుతుందో నచ్చదో" నసిగాడు ప్రకాశం.

"చెప్పు నాయనా!" అర్థించింది తల్లి హృదయం.

ఆశపడింది తండ్రి హృదయం.

"గేలానికి చేప చిక్కక తప్పద"ని అక్క హృదయం మురిసింది.

"ఏం మెత్తు వేస్తున్నాడా పీడ"ని బావ హృదయం ఆత్రుతపడింది.

చెల్లి హృదయంలో సంశయ సంబరాలు నిశ్చింతగా, నిర్మలంగా పద్మ హృదయం.

"రెండో నెలేకదా! ఎబార్షన్ చేయించవచ్చు. మూడోకంటి వాడికి తెలియదు. నా స్నేహితుడే - మోహనరెడ్డని - మంచి డాక్టరు. దమ్మిడీ పుచ్చుకోడు. మీరు సరేనంటే పైన ఏవేనా డబ్బులవసరమున్నా ఆ బాధ నే పడతాను''

"శివాలయం సందులో. పచ్చమేడలో వుంటున్న డాక్టరే నేమిట్రా ప్రకాశం! చాలా మంచివాడని, పెద్ద డిగ్రీలున్నాయని విన్నాను" అంది వాసంతి.

"అందరి ముఖాల్లోనూ కాంతి విరిసింది.

రేణుకకూడా అన్నయ్యవేపుతొలిసారిగా మెప్పుకోలుగా చూసింది.

పద్మ ఒక్కనవ్వే నవ్వింది.

* * *

# అంతరంగం

చీకటి కన్నీరు కారుస్తున్న శోకదేవతలా వుంది రాత్రి. రాత్రి చీకట్లో వేపచెట్టు కొమ్మల కరాలుచాచి విలపిస్తున్నది. విలపిస్తున్న వేపచెట్టు కొమ్మలక్రింద బాధా, దుఃఖాలతో కరడుగట్టిన హృదయంలా బండరాయి పడివుంది. పడివున్న బండరాతిమీద, వేపచెట్టు క్రిందన, రాత్రి నిశ్శబ్దంలో, మోకాళ్ళచుట్టూ చేతులు పెనవేసు కూర్చున్నాను.

చవితి చంద్రుడు వెలవెల పోతున్నాడు. గుడ్డి వెన్నెలనూ మబ్బులడ్డేశాయి.

చాపమీద అటునుంచి యిటు, యిటునుంచి అటు, ఎంత పొర్లినా నిద్ర రాలేదు. నిశ్శబంగా ఇలానడచివచ్చి కూర్చున్నాను-

నాకీ రాత్రి నిద్ర రాదేం!

పోనీ. ఒక్కసారే నిద్రపోతాను. మళ్ళీ లేవని నిద్ర. కలలులేని, కలతలులేని కమ్మని నిద్రపోతాను.

ఎప్పుడు పడుకున్నానో అలా. అమ్మ పొట్టలోనో, పొత్తిళ్ళలోనో.

ఎండిపోయిన అమ్మ రొమ్ముల్ని తడిపి పాలకోసం ఏడ్చి ఏడ్చి ఎంతసేపటికో నాన్న తెచ్చిన పాలు అమ్మ పట్టగా త్రాగి, అలసి నిద్రపోయానట చిన్నప్పుడు-"మళ్ళీ పద్మ లేవదా?" అమ్మ, నాన్న గాభరా పడినంత గాఢంగా.

మళ్ళీ,

ముప్ఫయ్ ఏళ్ళ తర్వాత.

ముప్ఫయ్ రెండేళ్ళప్పుడు.

రెండు నెలల క్రితం.

రెండు సంవత్సరాల నాటి ఆ రోజులాగే....

నిద్రపోయాను. హాయిగా. తృప్తిగా కోరుకున్న భక్ష్యాలన్నీ నెమ్మదిగా, నిండుగా, తనివితీరా భోంచేసి త్రేన్చినట్టు.

మూతలు పడుతున్న కళ్ళు బలవంతాన తెరచి, ఆఖరుసారి నా మీదకు వంగిన పెదాలక్రింద నా పెదవులు విప్పి. ఆవలించి నిద్రలోకి జారిపోయాను.

సృష్టికోసం పెనుగులాడి. పెనుగులాడి సఫల మనోరథయై. అలసిన ప్రకృతి విడిచిన నిట్టూర్పులాటి నిద్ర.

"రండి. రండి. రాత్రి ఏం జరిగిందో చూడండి. లేచి రండి" అని అరుస్తున్నట్టు తొలికోడి మేలుకొలుపు పాడబోతుండగానే రెడ్డి వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతూ "తలుపువేసుకో" అన్నాడు.

నిద్రలోకి ఒరుగుతున్న నాకు కలలు మానుకోఅన్నట్టు వినిపించింది రెడ్డిగొంతు.

బలవంతాన, పరువుని కాక సుఖాన్ని వదులుతున్నట్టులేచి తలుపుదగ్గరకెళ్ళాను-

చెదరిన నా ముంగురులనీ

చెరిగిన నా తిలకాన్నీ

తొలగిన పయ్యెదనూ

తొణికిన యవ్వనాన్ని

రాలిన సిగలోని పువ్వులనూ....

పూచిన పెదవులపై నవ్వులనూ చూస్తూ రెడ్డి తలుపుదగ్గరే ఆగి "పురివిప్పిన నెమలిలా వున్నావు" అన్నాడు-వదులై ముడి వీడి, అలలై ఒడలంతా ప్రాకిన జుత్తుని చూస్తూ.

అంటూ నవ్వాడు.

దోర మామిడిపండు దొంగిలించినట్టు.

పండుతిన్న ఆనందం కాదు. అందినందుకు, అంతకుమించి అందించుకున్నందుకు. అందించుకున్నాని అనుకుంటున్నందుకు.

నేనూ నవ్వేను. నవ్వుతూనే తలుపువేసి మళ్ళీ మంచంమీద వాలాను.

నవ్వనూ?

ఎప్పటినుంచో చూస్తూనే వున్నాను. రెడ్డి చూపుల గాలాలను-

ముప్ఫయ్ రెండేళ్ళ దేహంలో ఇంకా ఆకర్షణ వున్నందుకు ఆనందం కలుగుతుంటే-

రెడ్డే అన్నమాటేమిటి? మగవాళ్ళందరూను.

నాన్న దగ్గరకొచ్చే రిటైరైన ఆచారి మాష్టారి మొదలు....

"అక్కా! సినిమాలో జ్యోతిలక్ష్మి ఎంత బాగుందనుకున్నావు?" అంటూ సినిమా కబుర్లతో; ఏవేవో భోగట్టాలతో పొద్దస్తమానమూ కూడా తిరిగే పదమూడేళ్ళ శంకరం వరకూ....

అవే చూపులు.

ఆశగా. ఆబగా - అన్నం ముద్దవేపు "మాదా కబళంవాడు" చూసేటట్టు.

ఏంవుంది కొత్తగా.

సృష్టి మొదట్నుంచీ, స్త్రీ పురుషుల శరీర నిర్మాణం అంతే. ఎత్తు పల్లా లవే.

అయినా చూసిన ప్రతిసారీ, అదే తొలి


లక్ష్మీ పజిల్ నెం. 1

పంతపేట, కోవెలకుంట్ల (P. O.) కర్నూలు (జిల్లా) A. P.



అనివార్య కారణముల మూలమున ముగింపు తేదీ 20-2-74 వరకు పొడిగించడమైనది. కీ సొల్యూషన్ 4-3-73 జ్యోతి డైలీలో చూడండి.

3 నుండి 18 వరకు వాడిన అంకెలను వాడకుండా, ఎటు కూడినా 42 రావలెను. 1 కూపను రూ. 1-00. 5 కూపన్లు రూ. 4-00. 100 కూపన్లు రూ. 80-00. తెల్లకాగితముపై ఎన్ని కూపములైనా పంపవచ్చును. మనియార్డర్ కట్టి దాని రశీదు మీ కూపములతో పంపుడు. పూర్తి వివరములు 23-11-73 ఆంధ్రజ్యోతి వార పత్రికలో 35 వ పేజీ చూడండి. మిగతా నిబంధనలు మామూలే.

# మహాభినిష్క్రమణం

సారి అలాటి ఆకారంవున్న "జీవి"ని చూస్తున్నట్టు.

"నూతినుంచి నీళ్ళు తేకే నువ్వు" అంటుంది అమ్మ.

నడ్డిమీద నీళ్ళబిందె పెట్టుకుని, నడచి వస్తుంటే, తుళ్ళిననీళ్ల కుచ్చెళ్ళ నింత తడిపితే.

బెల్లంమీద ఈగలు వాలినట్టు అందరి చూపులూ .తడిసిన ఆ కాస్తమేరా వాలతాయి అందుకని.

"కిటికీ దగ్గర నీకేంపనే?" అని అడుగుతుంది వీధిలోకి చూస్తూ నిల్చుంటే.

ఏం పని? పొద్దున్న లేచిన దగ్గర నుంచీ ఒకటే పని. ఇంట్లో ఆపూట వంట వండడానికి లేనివేమిటోలెక్క చెప్పడం. తడిసిన కట్టెలతో పొయ్యి ముట్టించాలని యాతన పడడం. రాత్రి సద్దుమణిగేవరకూ ఒకటే పని.

తిండి గురించి వెతుక్కోవడం.

తిండి వండుకోవడం.

వండుకున్న తిండి తినడం;

సాయంకాలం మొక్కలకు నీళ్ళు పోస్తాను రేణుకతో కలిసి.

మొక్కలు మొగ్గలు తొడుగుతాయి.


పూలు పూస్తాయి.

పరిమళాలు వెదజల్లుతాయి.

పాపం తుమ్మెదలు వెర్రివి కట్నాలు కోరకుండానే అన్ని పూవులనూ ఒక్కలాగే పలకరించి ఫలింపచేసి వెళ్ళిపోతాయి.

ఒంగుని మొక్కలకి నీళ్ళుపోస్తుంటే మరచిపోదామనుకున్న ఒక్ళు జ్ఞాపక మొస్తుంది. మనసులోకి రానీయ రాదనుకున్న ఊహలు వస్తాయి. గాలి కలలనెన్నో తెచ్చి కలతలు రేపుతుంది.

ఎవడో చూస్తాడు - శకుంతలని దుష్యంతుడు చూసినటు. మహారాజులాగే వాడూ ఒప్పుకుంటాడు గాంధర్వానికి. ఒప్పుదలంతా చూపులలోనే చూస్తాడు. ప్రార్థనా పూర్వకంగా కరుణించమని దేవతలను కోరినట్టు, భరతుడు రాబోతున్నాడని తెలియగానే దెయ్యాన్ని చూసి పారిపోయినటు పరారీ అవుతారు. ఆ చూపులు నాలో రేపే సంచలనం అణచుకుని ఎవరి కర్మాన వారే పోతారని వూరుకునేదాన్ని.




ఎన్నేళ్లు?

ఎవరు లెక్కపెట్టారు?

కనీసం పదహారు సంవత్సరాలు.

నా కర్మమేమిటి మరి?

జీవితంలో రెండే సుఖాలు. తినడం, సుఖించడం. తినడానికి డబ్బుండాలి. సరిపడా డబ్బు లేదు. సరిపడా తిండి లేదు. సుఖించడానికి తోడు కావాలి. వెలుగు నీడలలో తోడుగా నిలబడేవాడు కావాలన్నా డబ్బు కావాలి. ఆ డబ్బే లేదు.

రెండు సుఖాలూ లేక బ్రతుకు ఎవరి గురించి ?

తల్లీ, తండ్రీ ముసలివాళ్లు. చనిపోతారు.

నా శరీరాన్ని యవ్వనం వాడిపోతుంది. ముసలి దవుతుంది దేహం. చదువైనాలేని నేను నా కోసమైనా ఎలా బ్రతకగలను? ఐనా చచ్చేవరకూ బ్రతకడం గురించే బ్రతకాలా?

ఏ మెప్పుకోసమని.

ఏ గొప్ప కోసమని.

ఏ గడ్డయినా తిని బ్రతుకుతున్నట్టు, ఏ గడ్డి కరిచయినా సుఖం పొందితే.

తప్పేముంది?

కడుపు నిండుగా వున్నవారే యితరుల తిండి మీదకు దండెత్తుతున్నారు.

సంసారాలు చేస్తూనే గడ్డి కరుస్తున్నారు. ఆడా, మగా యిద్దరూను.

ఇలాగే రాలిపోయేకన్నా.

సుఖం లేని,

అనుభూతి లేని,

స్పందన లేని

వేడిలేని

మోడు బ్రతుకు

ఎన్నాళ్లు బ్రతికినా ఏముంది?

"పురుష సంపర్కం ఎరగదు. ఎంత ఉత్తమురాలు" అంటారు. అన్నవాళ్ళలో ఉత్తములు కానివారెందరో!

"ఎవడు చూశాడు. ఈకాలంలో.కడుపూ కాలూ రాకుండా యిన్ని సదుపాయాలున్నాయి" అంటారు యింకొందరు.

"పోయింది పాపం.చచ్చినవాళ్ళగురించి చెడు తలవకూడదు." అని తటస్థ విధానం అవలంబించుతారు మరికొందరు.

లోకం కోసం యిలా బ్రతకాలా?

పాపానికి వెరచి యిలా గడపాలా?

లోకం కంటె నిజమైనది.

పాపం భయంకంటె బలమైనది,

అగ్నిలా దహించివేసేది.

ఆకలంత తీవ్రమయినది -

కోర్కె.

దాన్ని చంపుకుని ఏం ఒరిగించుకోను?

అందుకే -

అవాళ....

మూడో కాన్పు కష్టమై ఆస్పత్రిలో చేర్పిన అక్క వాసంతిని చూడ్డానికి అమ్మా, నాన్నా వూరెళ్ళారు.

చెల్లి రేణుక పాపపుభావన సోకని దివిజ కన్యలాగా నిద్రపోతున్నది.

వీధి గుమ్మంలో నిల్చున్నాను. తొలి ఆట వదిలే వేళయింది. క్లబ్బు నుంచి టెన్నిస్ రాకెట్టు పట్టుకుని అలాగే వస్తాడు రెడ్డి.

చలవ చేసిన తెల్ల చీర కట్టుకున్నాను. నీలం బోర్డరున్న తెల్ల జాకెట్టు తొడుక్కున్నాను. వాల జడ వేసుకున్నాను. సంపెంగలు పెట్టుకున్నాను.

సింగారించుకుని, శృతి చేసిన వీణలా నిల్చున్నాను గుమ్మాన్ని ఆనుకుని.

రెడ్డి వచ్చాడు మామూలు వేళకి. మామూలు త్రోవని-మామూలుగా గుమ్మం లోనికి చూపులు పంపుతూ.

నవ్వాను ఆకలి చూపులతో. ఒళ్ళంతా జుర్రేస్తున్నవాడు కొంచెం తొణికాడు. రమ్మన్నట్టు తలాడించాను. గుప్పుమన్న సంపెంగల వాసనలు కోరికల్లా చుట్టు ముట్టాయి.

తలుపులు వేశాను.

యవ్వనం తెర తొలిగింది.

దీర్ఘరోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము



హస్తప్రయోగం, అవయవం చిన్నదగుట. అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టం నపుంసకత్వం, ఉబ్బసం, కుష్టు బొల్లి, చర్మవ్యాధులు, కడుపు నొప్పి, చెవుడు పోస్టుద్వారాకూడా చికిత్స చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల, డా॥ దేవర, టి. బి. రోడ్, ఫోన్: 551 తెనాలి.
బ్రాంచి 9-D, శివాజీస్ట్రీట్, మద్రాస్-17

అయిదో రోజున వచ్చారు అమ్మా, నాన్నా.

నాలుగు రోజులు.

పూలరథంలా కాలం పరిగెత్తింది. రాత్రి పదినించీ తొలికోడి లేచేవరకూ.

పూలరథానికి ముళ్ళచక్రా లుంటాయని తెలుసు. తెలిసీ జాగ్రత్తపడలేదు.

ఎందుకు జాగ్రత్తపడాలి?

సరదాకైనా అనుకోలేదు రెడ్డి నన్ను పెళ్ళాడతాడని. సాయపడతాడని. అతని భార్యా, కుటుంబం అతనికున్నాయి.

అతనికి అందముంది. ఆరోగ్యంవుంది. రసికత వుంది. నాపై కోరిక వుంది.

నాకు కోరిక వుంది. అలాటి పురుషునిపై మక్కువ వుంది.

నిస్సారంగా, జడపదార్థంలా. జీవితం గడిపి కాలగర్భంలో కలిసిపోయేకన్నా....

ఒక్కసారి జన్మానికల్లా శివరాత్రి. మగవాడికి ఆడదివ్వగల సుఖం యిచ్చి, పురుషుడినుంచి స్త్రీ పొందగల సుఖంపొంది, మనిషి యిలా లింగభేదంతో, భిన్న శరీర నిర్మాణంతో సృష్టించబడ్డ ప్రయోజనం పొంది పిదప ఏం చెయ్యాలో నాకు తెలుసు.

సహజ వాంఛల్ని చంపుకుని, పరమ పవిత్రమైన జీవితం జీవించి, పొట్ట కూటికి నానా అవస్థలూపడి దిక్కులేని చావు– ఏ రోగంతోనో, ఎన్నాళ్లో తీసుకుని – చచ్చేకన్నా–

ఇంకా నా ఆరోగ్యంతో
యవ్వన బలంతో
అమృతాస్వాదనానుభవంతో
మధుర జ్ఞాపకంతో
జ్ఞాపక మాధుర్యంతో–
నిశ్చింతగా జీవితానికి మంగళం పాడేస్తాను.

నూతి గట్టుమీదకూర్చున్నాను. నూతిలో నీళ్ళు నిర్మలంగా. నిశ్చలంగా వున్నాయి.

"చచ్చిసాధించిందేముంది? అనుకుంటారేమో ఎవరైనా ఆశాజీవులు.

బ్రతికి మాత్రం నే సాధించే దేమిటి?

కడుపులో ప్రాణికోసం బ్రతకమంటే నాకు నవ్వొస్తుంది.

తలి దండ్రులున్న నా బ్రతుకే యిలా వుంది. తండ్రి ఎవరో చెప్పుకోలేని నా సంతతి బ్రతుకు ఊహించుకుంటేనే భయం వేస్తోంది. నాలో పెరిగే జీవనాంకురాన్ని ఎంత ప్రేమిస్తున్నానంటే– ఈ కఠినమైన, నిర్దాక్షిణ్యమైన, ధనం సర్వస్వమైన స్వార్థ ప్రపంచపద్మవ్యూహంలోకినాఅభిమన్యుడిని అభిశప్తుడిని, నిస్సహాయుడిని, బహిష్కృతుడిని ఎలా పంపించను? సింహం బోను నేనే తెరచి అందులో నా పాప నుంచనా వద్దు. వద్దు.

కడుపు తీయించుకుని బ్రతకనా?

బ్రతికి?

అసలెలా బ్రతకను?

కోరికలు చంపుకునా? శవంలాంటి బ్రతుకు బ్రతికేకన్నా శవంగా మారిపోవడం మంచిదికాదా?

కోరికలు తీర్చుకునా? మళ్ళీ, మళ్ళీ పుట్టబోయే ప్రాణుల్ని ఆపేస్తూ, ఆరోగ్యాన్ని, గౌరవాన్ని పోగొట్టుకుంటూ, నలుగురికీ గాలంవేస్తూ గడపనా? వద్దు వద్దు.

కడుపే రాకుండా ఆపరేషన్ చేయించుకునా?

కడుపునిండిన తర్వాత అన్ని సుఖాలూ కావాలొచ్చినట్టే, తీరిన కోరిక సహజ పరిణామాలకి తోవచూపదా?

తల్లి నవాలని, రొమ్మున పాపనదిమి స్తన్యమియ్యాలని, నా బాబుకి బంగారు భావి రూపొందించాలని.

కాని. ఆ తెరపే లేనప్పుడు, బ్రతుక్కి ప్రయోజనమే లేనపుడు నేను సైతం ప్రపంచాగ్నిలో సమిధనై ఆహుతవ్వడం మంచిది కాదా!

సమాజానికి సేవచేస్తూ, సంస్కరిస్తూ బ్రతకడానికి నేను తగను. ఊటలో నీరులా ఆదర్శం హృదయంలోనుంచి ఉబికిరావాలి.

ఐనా ఎందరు మహానుభావులు, సంస్కర్తలు, విప్లవ వీరులు అవతరించారీ భూమ్మీద– ఆయా కాలాల్లో, ఆయా దేశాల్లో మనిషి మనుగడ మారిందా?

మారిందేమో. మార్పు నాదాకా రాలేదేమో. నేనే మారాలో!

లేక అందనిదేమో మానవుని ఆదర్శం. యుగాలుగా ఎగురుతున్న కెరటాలు చందమామ నందుకోలేనట్టు, మనిషి కాంక్షించే స్వర్గం అందదేమో!

చెప్పానుగదూ! ఈ ఆలోచనలకి నే తగను.


తగినవారు; నాలాంటి నిర్భాగ్యానికి రాకుండా ఎదిరించండి.

నేను మాత్రం
ఇలాగే పోతాను.
కాలిక్రింద చీమ నలిగినట్టు
నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాను–
తృప్తిగానూ ....

నే దూకగానే నూతిలో కెరటాలు లేగుతాయి, కొంతసేపే. అంతలోనే అన్నీ సర్దుకుంటాయి.

ఈ ప్రపంచం యిలాగే సాగుతుంది.

మీ నీతే అమలుజరుగుతుంది. ★




# అరుణా
# ఆంధ్ర భాషా బోధిని

నూతన సంవత్సర కానుక!

అరువది రోజులలో ఆంగ్ల భాషను అభ్యసించండి!!

తెలుగు తెలిసిన వయోజనులు. స్త్రీలు. టీచరు సహాయము లేకుండానే ఇంటివద్దనె వుండి ఇంగ్లీషు నేర్చుకోవడానికి మా "అరుణా ఆంగ్ల భాషా బోధిని" "కల్పతరువు" వంటిది. మీ స్నేహితులతో ఇంగ్లీషులో మాట్లాడుకోవటానికి. ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవటానికి. ఇంకెన్నో మీకు కావలసిన విషయాల్ని గురించి ఇందులో బొమ్మలతో సహా చక్కని తేలికైన ఉదాహరణలు వున్నాయి. మీ ఆంగ్ల భాషా జ్ఞానము దిద్దుబాటుగాను, ధారాళంగాను వుండేందుకు వీలుగా పూర్తి గ్రామరు పొందు పరచబడివుంది. హై స్కూలు విద్యార్థులకు కూడా ఇది మిక్కిలి ఉపయోగకరమైనది.

మూడు రంగుల ఆఫ్ సెట్ రేపరుతో–క్యాలికో బైండు– దాదాపు 700 పేజీలు

వెల : రు. 9–00 పోస్టేజీ రు. 1–50. అదనం.

త్వరపడండి! నేడే మీ కాపీకి M. O. చేయండి!!

Sree Aruna Book House 1/48 Narayana Mudali St., Madras-1